ప్రజాశక్తి

మంగళవారం 13 డిసెంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నష్టాల వేట.. కష్టాల బాట..

- పంట చేతికందివచ్చే సమయంలో తుపాను
- రబీ పైర్లకు నష్టం కల్గిస్తున్న వర్షాలు
- పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కొనసాగిన వానలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మాండూస్ తుపాను వల్ల రైతులకు వచ్చిపడిన కష్టాలు గుంటూరు, పల్నాడు జిల్లాలో కొనసాగుతున్నాయి. తుపాను తీరం దాటి 48 గంటలు దాటినా ఇంకా వర్షాలు వెంటాడుతున్నాయి. సోమవారం వివిధ ప్రాంతాల్లో మోస్తరుగా జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ప్రత్తిపాడు, కాకుమాను, పొన్నూరు, ఫిరంగిపురం, పెదనందిపాడు, వట్టిచెరకూరు, ముప్పాళ్ళ, యడ్లపాడు, సత్తెనపల్లి, రెంటచింతల, గురజాల, బెల్లంకొండ, రాజుపాలెం, నూజెండ్ల, నాదెండ్ల, పిడుగురాళ్లలో మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. ప్రత్తిపాడులో అత్యధికంగా 39.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది.

కోతలకు సిద్ధంగా ఉన్న వరి కోతలు కోసుకోకుండా వర్షాలు ఆటంకంగా మారాయి. కోసిన వరి ఓదెలు తడుస్తున్నాయి. కోసి నూర్పిడి చేసినా ఆరబెట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆకాశం మేఘావృతమై ఉండటం వల్ల ఎప్పుడు వర్షం వస్తుందో..? ఎప్పుడు ఎండ వస్తుందో? తెలియడం లేదు. డెల్టాలో తడిసిన, రంగు మారిన ధాన్యం వివరాలు సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

మరోవైపు పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రెండు, మూడో విడత తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి నేలరాలింది. కొన్నిచోట్ల పూత, పిందె దెబ్బతిన్నాయి. ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాలతో పాటు పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పత్తి రైతులకు అపారనష్టం వాటిల్లింది. నష్టం వివరాలు అంచనా వేయడానికి కూడా అధికారులకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. పత్తి పైరు ఆశాజనకంగా ఉన్నట్టు కన్పిస్తున్నా వర్షాలకు ▶ 2లో



బొల్లాపల్లి మండలం పేర్ల పాడు గ్రామంలో ఓదెలపై తడిచిన వరి ని చూపుతున్న రైతులు

వరిని ముంచిన వాన

ప్రజాశక్తి - వినుకొండ



ఈపూరు మండలంలో పొలంలోని నీటిని బయటకు పంపేందుకు ఊట కాలువ చేస్తున్న రైతు

మాండూస్ తుపాను కారణంగా మూడ్రోజులుగా వర్షాలతో పంటలు నీట మునిగి రైతుల తీవ్రంగా నష్టపోయారు. నియోజకవర్గంలోని వినుకొండ, బొల్లాపల్లి, శావల్యాపురం, నూజెండ్ల ,ఈపూరు మండలంలో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. బోర్ల కింద సాగన కొన్ని వందల ఎకరాల్లోని వరి ఓదెలు దశలో ఉండడంతో వాటిపై వర్షపు నీరు నిలిచి గింజలు నానిపోతున్నాయి. బొల్లాపల్లి మండలంలో అధికంగా మిర్చి సాగు చేస్తుండగా ప్రస్తుతం కాపు దశలో ఉంది. వర్షానికి పైర్లు ఉరకెత్తి కాపు రాలిపోయే పరిస్థితి నెలకొంది. పూత దశలో ఉన్న కంది పంట పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదే వాతావరణం మరో రెండ్రోజులు కొనసాగితే పంటలన్నీ దెబ్బతిని తాము నిలువునా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

బొల్లాపల్లి మండలం పేర్లపాడులో 100 ఎకరాలకు పైగా వరి నీట మునిగింది. గ్రామానికి చెందిన జెడ్డా ఏడుకొండలు, రాసుమడి రమణయ్య, రాజు, కాళ్ల సుబ్బయ్య, అనంత రాములు సుమారు ఓ 20 మంది రైతులు 100 ఎకరాలకు పైగా బోర్ల కింద సాగుచేసిన వరి పంట కోత దశకు రావడంతో ఇటీవల కోత కోసి పొలంలోనే ఓదెలపై ఉంచారు. అప్పుడా పొలాల్లో నీరు నిలిచి ఓదెల్లోకి వర్షం నీరు చేరిందని రైతులు ఆపోతున్నారు. వినుకొండ మండలంలోని నరగాయపాలెం పెద్దకంచెర్ల తదితర గ్రామాల్లోనూ వరి దెబ్బతింది.

పంటను ప్రభుత్వమే కొంటుంది : ఎమ్మెల్యే

తడిసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొంటామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ మండలంలోని నరగాయపాలెం దెబ్బతిన్న వరి పంటను ఆయన ▶ 2లో

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

చేనేతకు బడ్జెట్లో రూ.6 వేల కోట్లు కేటాయించాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేతకు రానున్న బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలని, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 15న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ తెలిపారు. సోమవారం గుంటూరు జిల్లా చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం కె వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళగిరిలో జరిగింది. ఈ సమావేశంలో బాలకష్ణ మాట్లాడుతూ బడ్జెట్లో చేనేతకు నిధులు కేటాయించకపోవడం వలన ఆ రంగానికి అన్యాయం జరుగుతుందని విమర్శించారు. వ్యవసాయ రంగం తర్వాత రెండో ప్రాధాన్యత కలిగిన రంగం చేనేత రంగం అని, అలాంటి చేనేత రంగాన్ని కేంద్ర రాష్ట్ర పాలకులు అవలంబిస్తున్న విధానాలతో సంక్షోభంలో చేనేత పరిశ్రమ ఉందని అన్నారు. అందువల్ల చేనేత కార్మికులు ఆకలి చావులకు, ఆత్మ హత్యలకు బలైపోతున్నారని ▶ 2లో



మమోగ్రఫీ మెషిన్‌ను పరిశీలిస్తున్న మంత్రి రజనీ, ఎమ్మెల్యేలు

జిజిహెచ్‌లో సేవలను మెరుగుపరుస్తాం

మమోగ్రఫీ మెషిన్ ప్రారంభోత్సవంలో మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో వైద్య సేవలను మెరుగుపరుస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. జిజిహెచ్‌లో నాట్కో కేన్సర్ సెంటర్‌లో అమృతలూరుకు చెందిన గడ్డిపాటి కస్తూరిదేవి, రామమోహనరావు, శివరామకృష్ణ కుటుంబ సభ్యులు నాట్కో ట్రస్ట్ హైదరాబాదు రూ.కోటితో సమకూర్చిన 3డి ▶ 2లో



మంగళగిరి మండలం కాజలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పాశం రామారావు తదితరులు

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- తుపానుతో దెబ్బతిన్న పంటలకు పరిశీలన
- రైతు భరోసా కేంద్రంలో వినతి

2 లో

సాదియా ఆల్మాస్‌కు ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



ప్రజాశక్తి - మంగళగిరి : ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన సాదియా అల్మాస్‌ను ఇంటర్నేషనల్ అంబాసిడర్స్ పీస్ కార్పొరేషన్ యూఎస్ఎ ఆధ్వర్యంలో ఐకాన్ ఆఫ్ ది ఇయర్ 2022 అవార్డును విజయవాడలోని ఒక హోటల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అంబాసిడర్స్ పీస్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.ప్రవీణ్‌వర్మ, మైనార్టీ వెల్ఫేర్ ఏపీ సలహాదారు ఎస్.కె ఎమ్‌డి జియావుద్దీన్, ఏపీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మెంబర్ కె.బసవరాజు, ఏపీ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కోచ్ షేక్ సంధాని పాల్గొన్నారు.

నష్టాల వేట.. కష్టాల బాట..

(మొదటి పేజీ తరువాయి)

రాలిపోతున్న పూత, పిందె, దూది, గూడ దెబ్బతినడం వల్ల ఎంతమేరకు నష్టం వాటిల్లిందో చెప్పలేకపోతున్నారు.

వర్షాల నేపథ్యంలో మిర్చి రైతులకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు 2 నుంచి మూడు క్వింటాళ్ల మిరప కాయలు కోయడానికి సిద్ధంగా ఉండగా వర్షాల వల్ల కోయాలో...? కోసిన మిర్చిని ఎక్కడ ఆరబెట్టుకోవాలో? తెలియక రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

డెల్టాలో వరి కోతలు కోసిన పొలాల్లో రబీ పంటలుగా జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర సాగు చేశారు. అధిక వర్షాలకు రబీ పంటలు ఆదిలోనే దెబ్బతింటున్నాయి. వరి కోతలు పూర్తిచేసిన తరువాత ఈ భూమిలో ఉండే తడిలోనే జొన్న, మొక్కజొన్న, ఇతర అపరాలు సాగు చేయడం చాలా కాలంగా వస్తున్న ఆనవాయితి. కానీ ఈ ఏడాది రబీ సాగుకు విత్తనాలు వేసిన కొద్ది రోజులకు తుపాను వచ్చి భారీవర్షం కురిసి పైరు నీట మునిగాయి. డెల్టాలో 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 6800 ఎకరాల్లో శనగ, వెయ్యి ఎకరాల్లో జొన్న సాగు చేశారు. అధిక వర్షం వల్ల ఈ పైర్లు ఉరకెత్తుతున్నాయి. పల్నాడు జిల్లాలో ఖరీఫ్‌లో ఏ పంట వేయకుండా ఖాళీగా ఉన్న భూముల్లో రబీ సాగు కింద గత నెలలోనే 19 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 13 వేల ఎకరాల్లో శనగ, ఐదు వేల ఎకరాల్లో మినుము సాగు చేశారు. పంట ఎదుగుదల దశలో అధిక వర్షం పలుచోట్ల ఈ పంటలను నష్టపరిచింది.

వరిని ముంచిన వాన

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం పరిశీలించారు. 75 కిలోల బస్తాను రూ.1530కు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, గోతాలు హమాలీలు రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, రైతులు ఆందోళన పడొద్దని చెప్పారు.

ఈపూరు :మండలంలోని శ్రీనగర్, అగ్నిగుండాల గ్రామాల్లో 270 ఎకరాలల్లో వరి ఓదెలు నీటిలో మునిగాయి. నీటిని బయటికి పంపించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. **మాచర్ల:**కళ్లాల్లోని మిర్చి, ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఆగచాట్లు పడుతున్నారు. పూత దశలో ఉన్న మిర్చి పైరు ఎక్కడ పాడు అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వ్యవశాయశాఖ అధికారులు రైతుల పరిస్థితులను ఎక్కడిక్కడ పరిశీలన చేసి నష్టపోకుండా తగు సూచనలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నీరు, పారిశుధ్యంపై ఒక్కరోజు శిక్షణ

ప్రజాశక్తి - వినుకొండ

యూనిసెఫ్, సార్ట్ సంస్థ సహకారంతో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో 'నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత' పై ఒక్కరోజు శిక్షణను స్థానిక గుఱ్ఱం జాషువా కళావేదికలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిలర్ షేక్ షకీలా మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా జీవించాలంటే స్వచ్ఛమైన నీరు, పరిసరాలు పరిశుభ్రత ముఖ్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు నీరు, పారిశుధ్యంపై అవగాహన కల్పించి పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని అన్నారు. సంస్థ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ మాట్లాడుతూ నీటిని వృథా చేయొద్దని, భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. వివిధ అంశాలపై స్టేట్ రిసోర్స్ పర్సన్స్ వెంకట రమణ, రజిత వివరించారు. వనజా, విద్యారావ్, ఆషా, ఏడుకొండలు, షాహీద, సంధ్యా, ఖాజావలి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పునరుద్ధరణ కోసం వినతి

ప్రజాశక్తి - గురజాల

1-8 తరగతులు చదివే మైనార్టీ విద్యార్థులకు అందించే ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని ఎంపిజె రాష్ట్ర నాయకులు షేక్ సుభాని అన్నారు. ఈ మేరకు ఆర్‌డిఒ అద్దెయ్యకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఆర్థికంగా వెనకబడి స్కాలర్‌షిప్‌లతో చదువుతున్న వారికి విద్యనూ దూరం చేసే దురాలోచన ఇందులో ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనుక్కు తీసుకోవాలని ఎంపిజె పట్టణ అధ్యక్షులు షేక్ అల్లాబక్షు కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సయ్యద్ బాలసైదా, షేక్ నాగుల్ మీరా తదితరులున్నారు.

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- తుపానుతో దెబ్బతిన్న పంటలకు పరిశీలన
- రైతు భరోసా కేంద్రంలో వినతి

ప్రజాశక్తి - మంగళగిరి, మంగళగిరి రూరల్

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో, మంగళగిరి మండలం కాజలో తుపానుతో దెబ్బతిన్న పంటలను సిపిఎం నాయకులు సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రామారావు మాట్లాడుతూ నూర్పిడి చేసిన ధాన్యం తడిసిందని, పైరు నీటిలో పడి పంట రాలిందని చెప్పారు. ఎకరానికి 10 బస్తాల దిగుబడి తగ్గుతుందన్నారు. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.30 వేల పెట్టుబడి, కైలుకు రూ.20 వేలు ఖర్చు చేశారని, తుపాను తీవ్రంగా దెబ్బతీసిందని ఆవేదన వెలిబుచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వరి కోసిన పొలాల్లో మొక్కజొన్న వేసిన తుపాను వల్ల మొలకెత్తలేదని తెలిపారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.1545కు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా కొనుగోలు కేంద్రాలను ఎక్కడా ప్రారంభించలేదని విమర్శించారు. తేమ పేరుతో కొనకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులకు నెలకొందన్నారు. మిర్చి, పత్తి పంటలకూ నష్టం వాటిల్లిందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి ఎన్.శివాజీ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు చేయాలని, కేరళలో మాదిరి ధాన్యం క్వింటాళ్‌కు రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలని కోరారు. అనంతరం కాజలో రైతు భరోసా కేంద్రంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో నాయకులు ఈమని అప్పారావు, బి.కోటేశ్వరి, టి.ప్రసాద్‌రెడ్డి, బి.సత్యమారెడ్డి , ఆళ్ల సాంబిరెడ్డి, ఎస్.నిర్మల, ఎస్.నీలాంబరం, కె.హరిబాబు, ఎం.నాగేశ్వరావు, ఎం.శేషయ్య, అర్జున్‌రావు, పి.నాగభూషణం, ఎం.చిన్నబాపనయ్య, ఎం.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెదకాకాని మండలంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జిజిహెచ్‌లో సేవలను మెరుగుపరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్ మమోగ్రఫి మెషిన్‌ను, ఎక్సేరే యూనిట్‌ను మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల రొమ్ము కేన్సర్ కేసులు పెరుగుతున్నందున మహిళలకు వచ్చే కాన్సర్ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మమోగ్రఫి పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. నాట్కో క్యాన్సర్ కేంద్రానికి రోజుకు దాదాపు 60 నుండి 70 మంది రేడియో థెరఫి, కిమోథెరఫి చికిత్స కోసం వస్తుంటారన్నారు. మహిళలలో రొమ్ము క్యాన్సర్ వల్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పది నిమిషాలతో కేన్సర్ వ్యాధి నిర్ధారణ చేసే ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సిటీస్కాన్, ఎంఆర్ఐ వంటి పరికరాల నిర్వహణకు సంబంధిత ఏజెన్సీలకు నిర్వహణ సొమ్ము సకాలంలో రాక వాటి వినియోగం సరిగాలేదని, ఈ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. రూ.86 కోట్లతో తల్లీపిల్లల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తామ, బొంగరాలబీడులోని ఆరు ఎకరాల ఆసుపత్రి స్థలంలో ఆస్పత్రి విస్తరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో 11 మెడికల్ కళాశాలలు వున్నాయని, వాటిలో మెడికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ బొంగరాలబీడు స్థలంలో త్వరలోనే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ 40 ఏళ్ల దాటిన ప్రతి మహిళా మమోగ్రఫి పరీక్ష తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. నాట్కో ట్రస్ట్ ట్రస్టి కెవిఎస్ స్వాతి మాట్లాడుతూ నాట్కో కేన్సర్ ఆసుపత్రికి రోజుకు 200 మంది చికిత్స కోసం వస్తున్నారని, బెడ్లు సరిపోవడం లేదని తెలిపారు. అనంతరం రూ.40 లక్షల క్యాన్సర్ మందులను నాట్కో ట్రస్ట్ జీజీహెచ్‌కు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి జిఎస్ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే మద్దాలి గిరిధరరావు, రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వి.లక్ష్మణరెడ్డి, నాట్కో ట్రస్ట్ ప్రతినిధి సదాశివరావు, ఆర్‌డిఒ ప్రభాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ సజీలా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, ఎపిఎంఐసి ఎస్ఇ వి.చిట్టిబాబు, ఇఇ డి.శ్రీధర్ ప్రసాద్, ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, తహశీల్దార్ రిజ్వాన్ పాల్గొన్నారు.

మాఫియాకు అండగా ఉంటూ రైతులకు ద్రోహం : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఇసుక, గ్రావెల్, మద్యం, గంజాయి మాఫియాకు అండగా ఉంటున్న వైసిపి రైతులను మాత్రం దగా చేస్తోందని టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. సాగులో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని, వర్షం, తెగుళ్ల వల్ల దెబ్బతిన్న పంటలనూ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో భారీ అవినీతి జరిగిందని, కమీషన్ల కోసం మిల్లర్లతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. తరుగు పేరుతో టన్నుకు రూ.2500-3000 వరకు తగ్గించి కొని రూ.30 వేల కోట్లును దోచుకున్నారని అన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో పెదకూరపాడు ఎమ్మెల్యే అతని అనుచరులు ఇసుక మాఫియాలో సిద్ధ హస్తులయ్యారని, రోజుకు ఎంతొస్తుందనే లెక్క మినహా అభివృద్ధి పట్టడం లేదని విమర్శించారు. నకిలీ విత్తనాలతో కాశిపాడుకు చెందిన మల్లెల శ్రీనివాసరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అన్ని రంగాల్లో విఫలమైన ఈ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు జి.జనార్ధన్‌బాబు, జి.నాగపూర్ణచంద్రరావు, ఆర్.జగ్గారావు, కె.వీరరాఘవులు, జి.శ్రీనివాసరావు, జి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. జిల్లా చేనేత జోళి శాఖ వద్ద, కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో చేనేత కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి రామారావు మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకం షెడ్డు కార్మికులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా ఇన్సూరెన్స్ స్కీములు పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు సిహెచ్ సీతా రామాంజనేయులు, ఎన్ శ్రీనివాసరావు, జె శివ భవన్నారాయణ, ఎం చంద్ర, ఎస్ నరసింహారావు, కే సత్యం తదితరులు పాల్గొన్నారు.

200 మందిలో 15 మందికే స్థలం

ప్రజాశక్తి - వినుకొండ

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందనలో తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని, వినుకొండ మండలం ఉప్పరపాలెంలో 200 మందికి పైగా అర్హులుంటే 15 మందికే స్థలం మంజూరు చేశారని చెప్పారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే 1.8 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. టిడ్కో గృహాలను లబ్ధిదార్లకు అందించాలన్నారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్ రోడ్డులోని ఉషోదయ సూపర్ మార్కెట్‌లో ఆదివారం తెలవారు జామున భారీ చోరీ జరిగింది. రూ. 2లక్షల నగదుతో పాటు సుమారు రూ.10-15 లక్షల మేర వస్తువులను చోరీ చేసినట్లు యజమానులు తెలిపుతున్నారు. సూపర్ మార్కెట్‌లోని లాకర్‌లో ఉన్న నగదు మొత్తం మాయం అవడంతో ఇది బాగా తెలిసిన వారే చేసి ఉంటారని భావిస్తున్నారు. తాడేపల్లి సిఐలు సాంబశివరావు, శేషగిరిరావులు సంఘటనా స్థలానికి చేరుకోని విచారిస్తున్నారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలోని ప్రసిద్ధ చేనేత ఉత్పత్తులతో 14 రోజుల పాటు గుంటూరు టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్ కమీషనర్ ఎం.మల్లికార్జున నాయక్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శనకు మంచి స్పందన వచ్చిందని, రూ.1.25 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుండి వస్త్ర ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి సర్టిఫికేట్లు అందించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారికి ట్రాన్స్‌పోర్ట్, డీఏ అలవెన్స్‌లు కూడా అందించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్స్ అడిషనల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్, జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ వనజ, చేనేత సొసైటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న కమిషనర్, కలెక్టర్

పరస్పర దాడులపై కేసు నమోదు

ప్రజాశక్తి -తెనాలి రూరల్

పాత కక్షల నేపథ్యంలో యువకులు పరస్పర దాడులకు పాల్పడిన ఘటన పై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.రూరల్ గ్రామం అంగలకుదురుకు చెందిన గుమ్మడి భార్గవ్‌కు ఖగేశ్వర్తో నాలుగు నెలల క్రితం ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఖగేశ్వర్ తన మిత్రులతో కలిసి సోమవారం భార్గవ్ పై దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న భార్గవ్ మిత్రుడు ఖగేశ్వర్‌పై దాడి చేశారు. చికిత్స నిమిత్తం భార్గవ్ ఆసుపత్రికి వెళ్లగా, ఖగేశ్వర్ అక్కడికి వెళ్ళడంతో పరస్పరం వారి మధ్య ఘర్షణ జరిగింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రజని

ఎపిజిఇఎ కౌన్సిల్ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక మెడికల్ కాలేజిలోని జింకానా ఆడిటోరియంలో ఈనెల 18న నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆవిష్కరించారు. సోమవారం జిజిహెచ్‌ను సందర్శించిన మంత్రిని సంఘ జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా తదితరులు కౌన్సిల్ సమావేశాలకు ఆహ్వానించి, పోస్టర్ ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు మహబూబ్ బాషా , ప్రధాన కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్ కరీముల్లా షాఖాదరి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో పేషెంట్లకు సౌకర్యాలు కల్పించాలి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ కోరారు. జిజిహెచ్‌లో మంత్రి రజనికి వినతిపత్రం అందచేశారు. రోగులు పరీక్షల కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని, డాక్టర్లు రోగ నిర్ధారణ టెస్ట్‌కు రాసిన వెంటనే పరీక్ష జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భిణీలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని, వారికి సరైన సదుపాయాలు కల్పించాలన్నారు. మెడిసిన్ తీసుకోవటానికి కూడా ఎక్కువ సేపు లైన్‌లో వేచి ఉండాల్సి వస్తుందన్నారు. మెడిసిన్ ఇచ్చే సిబ్బందిని పెంచి, త్వరగా ఇచ్చే విధంగా చూడాలన్నారు. డాక్టర్లు వారానికి సరిపడా మెడిసిన్ రాస్తుంటే, కౌంటర్లలో మూడు రోజులకే ఇస్తున్నారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ

ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతంర పనులను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు వారంలో బుధవారం, శనివారం సంబంధిత ప్రాంతాల్లో హౌసింగ్, సచివాలయాలు, నాడు- నేడు తదితర కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు వేగవంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలను, సచివాలయలను తనిఖీ చేయాలని , డ్రాప్ అవుట్స్ పిల్లలతో పాటు, పౌష్టికాహార లోపల పిల్లలను, రక్త హీనత ఉన్న పిల్లలను గుర్తించి వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు పటిష్టంగా అమలు జరిగేలా పర్యవేక్షించాలన్నారు.సమీక్షలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

సచివాలయ అధికారుల పనితీరుపై సమీక్ష

గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు పనితీరు మెరుగుపర్చేందుకు సంబంధిత శాఖల అధికారులే నిరంతర పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి తదితరులతో కలిసి సచివాలయ ఉద్యోగుల పనితీరుపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల్లో వివిధ విభాగాలకు చెందిన కార్యదర్శుల పనితీరును ఆయా శాఖల జిల్లా అధికారులే పర్యవేక్షించాలన్నారు.

కేఎల్‌యు విద్యార్థికి ఆర్కిటెక్చరల్ థీసీస్ అవార్డు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాలయంలోని ఆర్కిటెక్చర్ కళాశాలలో ఈ ఏడాది డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థి టి.పవన్ కుమార్ ప్రదర్శించిన ఆర్కిటెక్చరల్ థీసిస్‌కు ఉత్తమ అవార్డును గెలుచుకున్నట్లు ఆర్కిటెక్చర్ విభాగ అధిపతి ఎ.ప్రియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆర్కిటెక్చర్ వారు నిర్వహించిన పోటీలలో దేశవ్యాప్తంగా ఆయా ఆర్కిటెక్చరల్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పోటీ పడగా కెఎల్‌యుకు చెందిన టి.పవన్ కుమార్ ప్రథమ స్థానాన్ని సాదించినట్లు ఆమె తెలిపారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆర్కిటెక్చర్ నమూనాల ప్రదర్శన పోటీలకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ (ఐఐఎ) నుండి పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయినట్లు తెలిపారు. తమ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి ప్రథమ స్థానం సాదించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్.జి.పార్థసారదివర్మ, ప్రో.వైస్.చాన్సలర్ డాక్టర్.ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ సెల్వ రాజ్,ఆచార్య సెంథిల్ కుమార్ తదితరులు పవన్‌కు కుమార్‌కు అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి -తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరు శివారు మద్రాసు కాలువలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభించింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుని వయస్సు సుమారు 30- 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. దీనిపై గ్రామ విఆర్ఓ ,వీఆర్ఏ, లు పరిశీలించగా మృతదేహంపై నలుపు రంగు జీన్స్ పాంటు, కాషాయం రంగు నిండు చేతుల చొక్కా, స్పోర్ట్స్ షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు. అదేవిధంగా చుట్టుపక్క ప్రాంతాల్లో కానీ దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి రూరల్ ప్రాంతాలలో ఏమైనా మిస్సింగ్ కేసులు ఉన్నా తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించ వలసిందిగా కోరారు.

పొందుగల లంక భూముల్లో ..

అమరావతి : మండల పరిధిలోని పొందుగల లంక భూముల్లో సోమవారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని అమరావతి పోలీసులు గుర్తించారు. మృతుడు 30 సంవత్సరాల వయసు కలిగి, ఐదు అడుగుల ఎత్తు, నలుపు రంగు, తల చుట్టూ ట్రీమింగ్ చేయబడి ఉంది. ఫుల్ హాండ్స్ టీషర్టు, తిక్ బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహం కృష్ణా నదిలో కొట్టుకొని వచ్చి పొందుగుల లంక భూముల్లో చిక్కుకొని ఉండటంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. ఆచూకీ తెలిసినవారు అమరావతి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సిఐ ఏ.వి శివప్రసాద్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ ఖుద్దూస్

ఉపాధ్యాయులకు ఎస్‌సిఈఆర్‌టి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు:ఎస్‌సిఈఆర్‌టి ఆధ్వర్యంలో 21వ తేదీ వరకు జిల్లాలోని ఎంపికైన ఉన్నత ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సిఆర్పిలకు గుంటూరు చలమయ్య జూనియర్ కాలేజిలో బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకునే సాధనాలపై శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ అబ్దుల్ ఖుద్దూస్, వెన్యూ కోఆర్డినేటర్ ఎం.డి ఖాసిం శిక్షణను పర్యవేక్షించారు. శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలు తెలుసుకోవడానికి, మెరుగుపరచడానికి అవసరమైన సాధనాలు, కొత్త పద్దతులు నేర్చుకుంటారని తెలియజేశారు. శిక్షణ అనంతరం పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి, భోదనా నైపుణ్యాలు మెరుగుప రిచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. రాష్ట్ర పరిశీలకులు టి.వీరయ్య మాట్లాడుతూ గతంలో జరిగిన శిక్షణా కార్యక్రమాలకు భిన్నంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారని అన్నారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్స్‌గా ఏ.పద్మలత, పి.శ్రీనివాసరావు, జి.కిరణ్ వ్యవహరించారు.

విజయవాడ పౌరసరఫరాల కార్యాలయం ముందు

రైతు, కౌలు రైతులకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాతావరణ అననుకూల పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులు, కౌలు రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం కానూరులోని పౌరసరఫరాల కార్యాలయం ముందు రెండు సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు టి.వి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో వర్షాలు పడటంతో రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. తేమశాతం కొలిచేందుకు మిషన్లు ఉండటం లేదని, రవాణా సదుపాయాలు లేవని అన్నారు. ఆర్‌బికెల్లో తేమశాతం పరిగణనలోకి తీసుకోవాలని మిల్లుల వద్ద నిర్ధారించకూడదని కోరారు. గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, కాటా వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని, తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయా లని కోరారు. ధాన్యాన్ని కాపాడు కునేందుకు పట్టాలు ఇవ్వాలని, ఈ క్రాప్‌ను సడలించి కౌలు రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కాటా వేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా ఆర్‌బికెల బాధ్యతతోనే మిల్లులకు పంపించాలని సూచించారు. రవాణా, కాటా కూలీ ప్రభుత్వమే భరించాలని, ధాన్యం తోలిన ఏడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమచేయాలని విజ్ఞప్తి చేశారు. తుపాను వల్ల తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మినుము, పెసల విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరగాని.శ్రీనివాసరావు, ములకా శివసాంబిరెడ్డి, చనుమోలు సైదులు, శివనాగేంద్రరరావు, సాంబిరెడ్డి, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పల్లె రామకృష్ణారెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - ముప్పాళ్ల

స్వాతంత్ర్య సమరయోధులు తొలితరం కమ్యూనిస్టు పల్లె రామకృష్ణారెడ్డి 28వ వర్ధంతి సభ మండలంలోని లంకెలకూరపాడులో సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన స్తూపం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన రామకృష్ణారెడ్డి గ్రామ మునుసుబుగా పనిచేస్తూ వ్యవసాయ కూలీలు, పేదల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల ఊళ్లలోనూ కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రచారం చేశారని, చనిపోయే వరకూ ఆ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కె.జగన్నాథరెడ్డి, పి.గోపాల్‌రెడ్డి, పి.సాంబిరెడ్డి, కె.శివ, రామకృష్ణారెడ్డి కుమారుడు అప్పిరెడ్డి, కుమార్తెలు, అల్లుళ్లు పాల్గొన్నారు.

అరవిందబాబుకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - నరసరావుపేట

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తండ్రి మోహన్‌రావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన నేపథ్యంలో అరవిందబాబును సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, ఇతర నాయకులు సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో కె.రామారావు, సిలార్ మసూద్, జిలాని మాలిక్ ఉన్నారు.

విద్యుత్ వినియోగదార్లు జాగ్రత్తలు పాటించాలి : డిఇ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు కొన్ని జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని విద్యుత్ డిఇ ఆశోక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లను నీటిలో ఉంచొద్దని, మోటార్లకు సంబంధించిన స్టార్టర్లు, డబ్బాలు తడవకుండా చూసుకోవాలని చెప్పారు. ఇవి తడిస్తే సర్వీసు తీగలు పాడవుతాయని, పైగా వాటిని తాకడం వల్ల విద్యుత్ షాక్‌కు అవకాశం ఉందన్నారు. ఒరిగిన స్తంభాల దరిదాపుల్లోకి వెళ్లొద్దని, అప్పటికే వైర్లు తెగి షాక్ కొట్టే వీలుందని అన్నారు. గృహ విద్యుత్ సర్వీసు వైర్లను, వాటికి వేళ్లాడే ఇనుప తీగలను, విద్యుత్ స్తంభాలు, ఇనుప స్తంభాలను తాకొద్దని, చెట్ల కొమ్మలు తీగలపై పడి కిందకు జారితే వాటిని ముట్టుకున్నా, కర్రతో కొట్టినా షాక్ కొడుతుందని అన్నారు. తడి చేతుల్తో స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను అత్యవసర పరిస్థితుల్లో తాకాల్సి వస్తే కాళ్లకు రబ్బరు చెప్పులు, చేతులకు గ్లౌజులు వేసుకోవాలని, పొడిగా ఉన్న కర్రనే ఉపయోగించాలని సూచించారు. విద్యుత్ సమస్య ఏదున్నా వెంటనే స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్, లేదా లైన్‌మెన్‌కు, సబ్‌స్టేషన్‌కు, విద్యుత్ ఎఇ తదితరులకు సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రమాదాలేమైనా జరిగితే 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

సమస్యలపై విఆర్‌ఒల నిరసన

- చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్
- తహశీల్దార్లకు వినతులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు



అమరావతిలో నిరసన తెలుపుతున్న విఆర్‌ఒలు


ఈపూరులో వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఒలు

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పల్నాడు జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో విఆర్‌ఒలు సోమవారం నిరసన చేపట్టారు. వివిధ అంశాలపై తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లకు వినతి పత్రాలిచ్చారు. ఇందులో భాగంగా **సత్తెనపల్లి** మండలంలోని వివిధ గ్రామాల విఆర్‌ఒలు భోజన విరామ సమయంలో సంఘం మండల అధ్యక్షులు ఘన్‌సైదా ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ఒత్తిడి కారణంగా చనిపోయిన విఆర్‌ఒల కుటుంబాకు రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని వెంటనే ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు 658 జీవోను అమలు చేయాలన్నారు. విఆర్‌ఓలు చాలా మంది చనిపోయినా ఆయా కుటుంబాలకు ఇప్పటికీ మట్టి ఖర్చుల డబ్బులైనా అందలేదని ఆవేదన వెలిబుచ్చారు. పని ఒత్తిడి తగ్గించాలని, పిఒఎల్‌ఆర్ కోసం ప్రెఫార్మా-1-6 వరకు వాటి ప్రింట్ కోసం వేలల్లో ఖర్చులను తామే భరిస్తున్నా ఇంకా ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుండి రాలేదన్నారు. ఈ ఖర్చులకే తాము అప్పులపాలవగా ఇప్పుడు మళ్లీ రీసర్వేకు కూడా డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోందని చెప్పారు. సర్వేకు సంబంధించి దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాలని, 100 రోజుల్లోనే పూర్తి చేయాలనే నిబంధనను సడలించాలని డిమాండ్ చేశారు. గ్రామ సహాయకుల నుండి గ్రేడ్-2 వీఆర్వోలుగా పనిచేస్తున్న 3795 మంది గ్రామ రెవెన్యూ అధికారులకు వెంటనే ప్రొబిషన్ డిక్లేర్ చేసి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. **ఈపూరులో** తహశీల్దార్ సిహెచ్ విజయకుమారికి వినతిపత్రం ఇచ్చారు. ఖాళీగా ఉన్న విఆర్‌ఒ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. షేక్ నబి, నాగరాజు, వెంకయ్య, పిచ్చయ్య, వెంకటేష్ పాల్గొన్నారు. **అమరావతి** తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. గ్రామ సచివాలయాల్లో 90 శాతం సర్వీసులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి అయిన దృష్ట్యా వీఆర్వోలకు కంప్యూటర్, స్టేషనరీ ఇవ్వాలని కోరారు. తమకు మండల స్థాయిలో సమావేశాలు పెట్టాలేగాని, జిల్లాస్థాయి సమావేశాలకు పిలవొద్దని కోరారు. అనంతరం తహశీల్దార్ జయశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. మురళికృష్ణ, రామిరెడ్డి, మురళి, ముకుంద, వెంకటకృష్ణ, ఇబ్రహీం, సుభాని, సురేష్ పాల్గొన్నారు. **పెదకూరపాడులో** విఆర్‌ఒలు నిరసన అనంతరం తహశీల్దార్ క్షమారాణికి వినతిపత్రం ఇచ్చారు.

కలెక్టర్ స్పందనకు 124, ఎస్పీ స్పందనకు 46 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివశంకర్


సమస్యలు వింటున్న ఎఎస్‌పి బిందుమాధవ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

'స్పందన' ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 'స్పందన' కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన స్పందనకు 124 అర్జీలొచ్చాయి. వీటిని కలెక్టర్‌తోపాటు జెసి శ్యామ్ ప్రసాద్, డిఆర్‌ఒ వినాయకం స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేస్తే సంబంధిత అధికారులకు నోటీల జారీతోపాటు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా అర్జిదార్లకు రెడ్‌క్రాస్ సహకారంతో భోజనాన్ని సమకూర్చారు.

ఎమ్మెల్యే కనుసన్నల్లో వాలంటీర్ల అన్యాయం

పలు సమస్యలపై కలెక్టర్‌కు టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు వినతిపత్రం ఇచ్చారు. 4వ వార్డులోని టిడిపి నాయకునికి ఆరు నెలలుగా పింఛను రావడం లేదని, 3వ వార్డులో పేద కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారుల్లో ఒక్కరికీ 'అమ్మఒడి' మంజూరు కాలేదని చెప్పారు. ఎమ్మెల్యే కనుసన్నల్లో వాలంటీర్లు ఇవ్వన్నీ చేస్తున్నారని ఆరోపించారు. రావిపాడు ఎస్సీ కాలనీలోని ఖాళీ స్థలాన్ని పార్కుగా వినియోగించాలని, భవనాలు నిర్మించవద్దని, ఆ కాలనీకి తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. రొంపిచర్ల మండలం అన్నవరంలో 140 డబుల్ ఎంట్రీ ఓట్లును తొలగించాలన్నారు. ఆరేపల్లిలో మృతి చెందిన యువకుని కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

ప్రతి ఫిర్యాదుపైనా శ్రద్ధ పెట్టాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - నరసరావుపేట

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో 46 ఫిర్యాదులను ఎఎస్‌పి జి.బిందుమాధవ్ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపైనా శ్రద్ధ వహించాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్‌రావు, రవిచంద్ర, జయరాం ప్రసాద్, సిఐ సుభాషిణి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిని కూల్చాలని చూస్తున్నారు

తాతల కాలంలో తాను కొనుగోలు చేసిన, ధ్రువపత్రాలన్నీ ఉన్న స్థలం (గ్రామ కంఠం)లో నిర్మించిన మా ఇంటిని కూలగొట్టడానికి, ఆ స్థలాన్ని ఆక్రమించడానికి సమీపంలోని గుజ్జర్లపూడి ఎలిజిబెత్, ఆమె కుమారుడు మార్టిన్ యత్నిస్తున్నారని, తమపై దౌర్జన్యం చేస్తున్నారని పిడుగురాళ్ల పట్టణం మిలటరీ కాలనీకి చెందిన చల్లా రత్నకుమారి, చల్లగుండ్ల సంతోష్, కుమారి ఫిర్యాదు చేశారు. వారి దౌర్జన్యాల నేపథ్యంలో వివాద పరిష్కారం కోసం సర్వేకు దరఖాస్తు చేశామని, సర్వే చేసేదాకైనా ఆగకుండా ఇంటి ప్రహరీని కూల్చారని, ఇంటినీ కూల్చడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

రెట్టింపు అప్పు కట్టినా ఆటో లాక్కెళ్లాడు

తాను తీసుకున్న రూ.52 వేల అప్పునకు రెట్టింపు చెల్లించినా ఇంకా బాకీ ఉందంటూ ఆటోను కూడా లాక్కెళ్లాడని దాసు అనే వ్యక్తిపై నకరికల్లు మండలం గుండ్లపల్లికి చెందిన నాగూర్ షరీఫ్ ఫిర్యాదు చేశారు. దీనిపై తాను నకరికల్లు పోలీసులకు



ఫిర్యాదు చేసినా వడ్డీ వ్యాపారి వైపే వారూ మాట్లాడుతున్నారని, ఎస్ఐ దుర్భాషలాడారని వాపోయాడు. తన కుటుంబా జీవనానికి ఆధారమైన ఆటోను ఇప్పించాలని కోరారు.

రుణం ఇప్పిస్తానని మోసం..

తన ఇంటి నిర్మాణానికి రుణం ఇప్పిస్తానంటూ రూ.11 వేలు తీసుకున్న వ్యక్తి మోసం చేయడంతో పాటు అడుగుతున్నందుకు దుర్భాషలా డుతూ బెదిరిస్తున్నాడని అచ్చంపేట మండలం కొత్తపల్లికి చెందిన చిరువ్యాపారి చిలకా కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. నరసరావుపేటలోని వారాహి ప్రైవేట్ ఫైనాన్స్‌కు చెందిన కిషోర్‌బాబు రుణం మంజూరు పేరుతో డబ్బు తీసుకున్నాడని, ఇప్పుడు మంజూరు చేయడం లేదని, కార్యాలయానికి వెళ్లి అడుగుతుంటే బయటకు వెళ్లాలంటూ తిడుతున్నాడని వాపోయారు. అదేమంటే దిక్కున్నచోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.



డబ్బులివ్వకుండా కాంట్రాక్టర్ మోసం..

ఇసుక రవాణా తాలూకు రూ.8.20 లక్షలు ఇవ్వకుండా పిడుగురాళ్లకు చెందిన కాంట్రాక్టర్ సిహెచ్.సైదారావు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ధరణికోటకు చెందిన నడకుదురు పుల్లారావు ఫిర్యాదు చేశారు. బొవ్వమ్మవానిపాలెం, హనుమాన్‌పాలెం ఇసుక రీచ్‌లలో పడవల ద్వారా ఇసుకను పాయింట్ల వద్దకు సరఫరా చేర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని, తాను పడవలు అద్దెకు తీసుకుని తనతోపాటు మరో 15 మంది కూలీలతో పని చేయించానని తెలిపారు. మూడేళ్లపాటు చేసిన పనికి గాను రావాల్సిన నగదును కాంట్రాక్టర్ ఇవ్వకపోవడంతోపాటు దాడి చేశాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. తన ఇంటిని తనఖా పెట్టి కూలీలకు డబ్బులిచ్చానని, కుటుంబ పోషణా భారమైన తనకు న్యాయం చేయాలని కోరారు.



అర్జీలు రీఓపెన్ అయితే చర్యలు

స్వయంగా హాజరు కావాలని పలువురు మండలాధికారుల్ని ఆదేశించిన కలెక్టర్



ప్రజాశక్తి-గుంటూరు

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పరిష్కరించిన అర్జీలు రీఓపెన్ అవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి, సహాయ కలెక్టర్ శివనారాయణ శర్మ, డిప్యూటీ కలెక్టర్లు లలిత, భాస్కర నాయుడు, డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు పరిష్కరించిన తరువాత అవి రీ ఓపెన్ కాకుండా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలన్నారు. గతవారం కంటే ఈవారం రీ ఓపెన్ అయిన పిటీషన్లు పెరిగాయన్నారు. సరైన సమాధానం ఇవ్వకుండా రీ ఓపెన్ అయిన పిటిషన్‌కు కారకులైన పొన్నూరు మున్సిపాలిటీ, సాంబశివ నగర్ వార్డు శానిటేషన్ సెక్రటరీ, వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు పంచాయతీ సెక్రటరీ, తెనాలి మండలం కొలకలూరు గ్రామ పంచాయతీ సెక్రటరీలను బుధవారం జిల్లా కలెక్టర్ సమక్షంలో హాజరు కావలసిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, పీడీ డ్వామా యుగంధర్ కుమార్, డియం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుమయాఖాన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డును వాలంటీర్ తీసుకొని ఇవ్వట్లేదు



తనకు ఇంటి స్థలం ఇచ్చే సమయంలో వాలంటీరు చంద్ర తన ధృవీకరణ కోసం రేషన్ కార్డు తీసుకొని తిరిగి ఇవ్వట్లేదని ఫిరంగిపురం మండలం, యర్రగుంటపాడుకు చెందిన ఒట్టి నాగేంద్రం ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు కార్డు గురించి అడిగినా ఇవ్వట్లేదని, ప్రతి నెలా రేషన్ మాత్రం తీసుకుంటున్నామన్నారు. తన భర్త చనిపోయినందున వితంత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్డు అడుగుతున్నా ఇవ్వట్లేదన్నారు. తనకు ఎలాంటి ఆధారం లేదని రేషన్ కార్డు ఆధారమన్నారు. కావున తన కార్డు తనకు ఇప్పించాలని, వితంతు పింఛన్ మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ విద్యార్థుల మెస్‌ఛార్జీలు పెంచాలి : పిడిఎస్‌యు

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జిలు పెంచాలని, హాస్టల్స్‌కు సన్నబియ్యం సరఫరా చేయాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, కమాటీ, కుక్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని, జిఒ 77 రద్దు చేయాలని తదితర డిమాండ్లతో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వ హించి, అనంతరం స్పందనలో అర్జీ అందచేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి నాలుగేళ్లు అవుతున్నా మళ్లీ పెంచలేదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు అన్నారు. మార్కెట్లో ధరలు చుక్కలు అంటుతున్నాయని, కానీ విద్యార్థులకు మాత్రం పూటకు రూ.14లు ఇస్తున్నారన్నారు. స్కూల్ విద్యార్థులకు నెలకు రూ.3వేలు, కాలేజి విద్యార్థులకు రూ.4వేలు పెంచాలని కోరారు.

తప్పుడు ఫిర్యాదుతో నాలా కన్వర్షన్ అడ్డుకుంటున్నారు..

మా భూమి సరిహద్దులు పక్కాగా ఉన్నప్పటికీ, తమ భూమిలో పెట్రోలు బంక్ పెట్టుకోనివ్వకుండా అడ్డుకునేందుకు, దురుద్దేశంతో మార్కొండారెడ్డి తమ భూమి కన్వెనర్షన్‌ను అడ్డుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని జాలగిరి లీలాశంకర్, మేడా గోపి స్పందనలో అర్జీ అందచేశారు. అంకిరెడ్డిపాలెం సర్వే నంబర్ 636-1లో 906.69 చదరపు గజాల స్థలాన్ని 2020లో కొనుగోలు చేశామన్నారు. పెట్రోలు బంక్ నిర్వహించుకోవటానికి నాలా కన్వర్షన్‌కు ఆర్‌డికు దరఖాస్తు చేసుకోగా, తమ స్థలానికి దక్షిణం వైపు ఉన్న హద్దుదారు మార్కొండారెడ్డి ముందు తన స్థలం పెట్రోలు బంక్ నిర్వహించుకోవటానికి అద్దెకు అడిగి తీసుకోకుండా, తన పక్క స్థలం కొని పెట్రోలు బంకుకు పర్మిషన్ల కోసం తిరుగుతున్నామని తెలుసుకొని తప్పుడు ఫిర్యాదుతో కన్వెర్షన్‌ను అడ్డుకుంటున్నారన్నారు. మా స్థలానికి ఎన్‌ఒసి ఇవ్వటానికి కావాల్సిన అన్ని రుజువులతో కూడిన పత్రాలు సమర్పించామన్నారు. సరిహద్దు వివాదం ఉందని మార్కొండారెడ్డి కోర్టులో పిటిషన్ వేసినా కోర్టు పిటిషన్‌ను కొట్టివేసిందన్నారు. మండలాధికారులు తమ స్థలంలో ఎలాంటి ఆక్రమణలూ లేవని ధృవీకరించారన్నారు. నాలా కన్వనర్షన్ కోసం ఆర్‌డిఒకు దరఖాస్తు చేసి 46 రోజులు గుడుస్తున్నా ఎలాంటి స్పందన లేదన్నారు. పక్క స్థలం హద్దుదారుడుని ప్రోత్సహిస్తూ, ఎస్‌టిలమైన తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.





అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

జిఎంసి స్పందనకు 37 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

సచివాలయాల ద్వారా ప్రజలకు నిర్దేశిత గడువులోగా మెరుగైన సేవలు అందేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సచివాలయాల్లో కరెంట్ బిల్లులు, ఈ.సి. దరఖాస్తులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వ సేవలపై వాలంటీర్లు ప్రతి ఒక్కరికి తెలియ చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం 11, ఇంజినీరింగ్ విభాగం 12, ప్రజారోగ్య విభాగం 9, రెవెన్యూ విభాగం 5 ఫిర్యాదులు, మొత్తం 37 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ మూర్తి, సిఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ. డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

సబ్ కలెక్టర్ స్పందనకు నాలుగు అర్జీలు

ప్రజాశక్తి-తెనాలి

ప్రజల సమస్యలను పరిశీలించి, వాటిని త్వరితగతిని పరిష్కరించేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం నాలుగు అర్జీలు దాఖలైనట్లు సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు, పోలీసు శాఖకు సంబంధించి ఒకటి, నీటి పన్నుకు సంబంధించి ఒకటి నమోదయ్యాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు అర్జీలను సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి స్పందన ఓ చక్కని వేదికని, దీనిని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. స్పందనలో వివిధ శాఖల అధికారులతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు,కౌలురైతు సంఘం నాయకులు

ధాన్యం మొత్తాన్నీ కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి దుగ్గిరాల

తడిచిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని సోమవారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ కే మల్లేశ్వరికి అర్జీని అందజేశారు. కోతలు కోయటానికి ముందు చల్లిన మినుము, పెసర, విత్తనాలకు కూరగాయల పంటలకు నష్టపరిహారం చెల్లించాలని అర్జీలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు, కౌలు రైతు సంఘం నాయకులు వల్లభనేని సాంబశివరావు వై రామేశ్వరావు, భీమవరం అమ్మిరెడ్డి, కొండూరు కోటయ్య, అద్దంకి పాములు తదితరులున్నారు.

విలువలకు నిలువెత్తు నిదర్శనం నిమ్మగడ్డ

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పలు చోట్ల ఘన నివాళులు

ప్రజాశక్తి మంగళగిరి రూరల్.

ఆదర్శ ప్రజాప్రతినిధి నిమ్మగడ్డ రామ్మోహనరావు కడ వరకు కమ్యూనిస్టు విలువలతో పనిచేశారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. సోమవారం సిపిఎం నేత నిమ్మగడ్డ రామ్మోహనరావు 15వ వర్ధంతి సభ కాజలో నిర్వహించారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు నిమ్మగడ్డ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మంగళగిరి నియోజకవర్గంలో సమితి అధ్యక్షులుగా, మండల అధ్యక్షులుగా, శాసనసభ్యులుగా పనిచేసి మంగళగిరి ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక పాఠశాల నిర్మాణం, వంతెనలు, రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు నిర్వహించారని అన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఖరీదైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తే మాకు అవసరం లేదని వీటిని పేదలకు ఇవ్వాలని తృణప్రాయంగా వదిలేశారన్నారు. నిమ్మగడ్డ ఆశయాలను ప్రతి ఒక్కరు అలవర్చుకుని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి కోటేశ్వరి, కాజా గ్రామ నాయకులు బి. సత్యమా రెడ్డి , ఆళ్ల సాంబి రెడ్డి, బి .పేరిరెడ్డి, బ్రహ్మారెడ్డి , శివయ్య, అరుణ, పి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాయపాలెంలో నివాళులర్పిస్తున్న ఎం.రవి తదితరులు



మంగళగిరిలో నివాళులర్పిస్తున్న చెంగయ్య తదితరులు

కృష్ణాయపాలెంలో :మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహన్ రావు వర్ధంతి సభ ఆయన స్వగ్రామం కష్ణయపాలెం గ్రామం లో సీపీఎం ఆధ్వర్యం లో నిర్వహించారు. నిమ్మగడ్డ విగ్రహానికి సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ నిమ్మగడ్డ ఆశయస్ఫూర్తితో ప్రజా సమస్యలపై రానున్న కాలంలో ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రాజధానిలో నిలిపివేసిన అభివృద్ధి పనులను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ రామ్మోహన్ రావు సోదరులు నిమ్మగడ్డ రమేష్, మురళీకష్ణ కుమారులు బాల ప్రకాష్, దినకర్, సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఏం. బాస్కరయ్య, ఈమని రామారావు, ఎస్.కె ఎర్ర పీరు, ఎర్రమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : నిమ్మగడ్డ ఆశయాలు ముందుకు తీసుకెళ్లడానికి సిపిఎం కార్యకర్తలు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. మంగళగిరి మాజీ ఎమ్మెల్యే, సిపిఎం నాయకులు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు వర్ధంతి సందర్భంగా సోమవారం గౌతమ్ బుద్ధ రోడ్డులోని నిమ్మగడ్డ విగ్రహానికి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి డి రామారావు, ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ, రైతు సంఘం మండల కార్యదర్శి టి ప్రసాద్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కాజలో నివాళులర్పిస్తున్న పాశం రామారావు, ఈమని అప్పారావు. కోటేశ్వరి తదితరులు



అవార్డును అందుకుంటున్న డాక్టర్ జిపి రాజు

ద్రోణాచార్య అవార్డును తల్లిదండ్రుకు అంకితమిచ్చిన ప్రొఫెసర్

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక జెఎన్‌టియు కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జిపి రాజు ద్రోణాచార్య అవార్డును అందుకున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ రంగంలో స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్‌లో అత్యుత్తమ సహకారం అందించినందుకు ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన (ఐఎఫ్‌పిఇ ఎఫ్ఎస్ఎస్ఎ) అవార్డ్సు-2022 సభలో అథ్లెటిక్స్ రంగంలో అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఐఎఫ్‌పిఇ ఎఫ్ఎస్ఎస్ఎ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు. డాక్టర్ జిపి రాజును కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలిపారు. అవార్డును తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు జిపి రాజు ప్రకటించారు.

రేపు స్కై మార్షల్ ఆర్ట్స్ ఎంపికలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ క్రీడా ఎంపిక పోటీలు పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాలలో బుధవారం నిర్వహిస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు ప్రతాపరెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల విభాగంలో ఎంపికలు ఉంటాయని, వివరాల కోసం పిఇటి పఠాన్ ఖాదర్ మస్తాన్, ఫోన్ : 9703678786కు సంప్రదించాలని సూచించారు.

రక్తహీనత బాధితులను గుర్తించండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్త హీనత ఉంటే గుర్తించాలని ఎంపిడిఒ నరసింహారావు చెప్పారు. రక్తహీనత గుర్తింపు, నమోదుపై మండలంలోని తాళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం సమావేశం నిర్వహించారు. మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఎఎన్ఎంలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రియాంక, ఐసిడిఎస్ సిడిపిఒ స్వర్ణకుమారి, సూపర్‌వైజర్ షేక్ మున్ని పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కన్ను ద్వారా వచ్చే వ్యాధులపై తాళ్లూరులో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రియాంక, పీహెచ్ఎన్ దుర్గా, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లలోని వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ విజయ్‌కుమార్ అధ్యక్షతన శిక్షణ నిర్వహించగా మెడికల్ ఆఫీసర్ డాక్టరు శివలీల వివిధ అంశాలపై వివరించారు. ఎంఇఒ వి.నాగయ్య, డాక్టరు ప్రవీణ్, ఐసిడిసి ప్రతినిధి లీలావతి పాల్గొన్నారు.



జాతీయ మహాసభ జయప్రదం కోసం జెండావిష్కరణ



ముప్పాళ్లలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ముప్పాళ్ల

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ జాతీయ మహాసభ ఈనెల 13-16 తేదీల్లో కేరళలోని త్రిసూర్‌లో జరుగుతున్నట్లు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు జెండాను మండల కేంద్రమైన ముప్పాళ్లలో ఎం.సీతారామిరెడ్డి సోమవారం అవిష్కరించారు. బాలకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలో చేసిన రైతు పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు రైతులు చేయాలన్నారు. రైతు రుణమాఫీ చట్టం, పంటలకు మద్దతు ధరల చట్టంతోపాటు వ్యవసాయాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు చేయాల్సిన ఉద్యమాలపై మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టి.అమరలింగేశ్వరరావు, జి.నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ మహాసభల నేపథ్యంలో మండలంలోని లింగారావుపాలెంలో జెండాను రైతు సంఘం గ్రామ అధ్యక్షులు ఎం.మల్లికార్జునరావు సోమవారం ఎగురవేశారు. మండల కార్యదర్శి టి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎఐకెఎస్ మహాసభ కేరళలోని త్రిసూర్‌లో ఈనెల 13-16 తేదీల్లో జరగనున్నట్లు చెప్పారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని, రైతులను కాపాడ్డానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, అందుకు చేయాల్సి పోరాటాలపై మహాసభలో చర్చిస్తారని తెలిపారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 3 నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు 500 రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేసి తిప్పికొట్టారని, ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అయితే చట్టాలను వెనక్కు తీసుకునే సందర్భంలో ప్రధాని ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. పోరాటంలో మరణించిన 750 మంది రైతులకు పరిహారం దక్కలేదని, వ్యవసాయ బోర్లకు నీటి మీటర్లు పెడుతున్నారని, పంటలకు మద్దతు ధర చట్టం చేయలేదని విమర్శించారు. వీటి అమలు కోసం రైతులు మరోసారి పోరాడాల్సి ఉందని, అందులో భాగంగా ఎఐకెఎస్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎ.సుబ్బారావు, జి.హరిబాబు, పి.సాంబయ్య, గురుస్వామి పాల్గొన్నారు.



లింగారావుపాలెంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వికలాంగుల అభ్యున్నతికి ఆర్థిక ప్రోత్సాహం

చెక్కులు అందించిన పల్నాడు జిల్లా కలెక్టర్



వికలాంగులకు చెక్కులు అందిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆర్థిక ఆసరా కోసం విన్నవించుకున్న ముగ్గురు వికలాంగులకు చెక్కులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం అందించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 3వ తేదీన దాచేపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వికలాంగులు తమ ఆర్థిక అవసరాలను విన్నవించుకున్నారు. టైలరింగ్ ద్వారా జీవనోపాధి పొందుతున్న కొప్పుల లక్ష్మీ అనే వికలాంగ మహిళ పిండిమర ఏర్పాటు కోసం ఆర్థిక సాయం కోసం విన్నవించగా తన వ్యాపార అభివృద్ధి కోసం ఆర్థిక తోడ్పాటు కావాలని బొలిశెట్టి అన్నపూర్ణమ్మ అనే మరో మహిళ విన్నవించారు. వీరిద్దరికీ చెరి రూ.50 చొప్పున చెక్కులను కలెక్టర్ అందించారు. ఇదిలా ఉండగా పత్ర ప్రసన్నకుమార్ అనే మానసిక వికలాంగునికి పింఛను రావడం లేదని 'స్పందన'లో ఫిర్యాదు రాగా రూ.36 వేలు అందించారు. బాధితునికి పింఛను మంజూరుకు చర్యలు తీసుకోవాలని, ఇప్పటి వరకూ ఇవ్వకపోవడానికి గల కారణాలు తెలపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు 'నవోదయం'

పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో 'నవోదయం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, వ్యాపారుల అభివృద్ధి కోసం దరఖాస్తు చేసుకునే వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పతకాలు సాధించిన జైభారత్ విద్యార్థులు

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో జైభారత్ విద్యార్థులకు ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - క్రోసూరు

న్యూ షావోలిన్ కుంగ్ ఫూ అకాడమి ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ 6వ జాతీయస్థాయి టోర్నీలో మండల కేంద్రమైన క్రోసూరులోని జై భారత్ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు కుంగ్ ఫూ ఛీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి 2 వేల మంది హాజరవగా జైభారత్ స్కూల్ నుండి 53 మంది పాల్గొన్నారని చెప్పారు. వీరిలో 12 మంది బంగారు పతకాలు,9 మంది రజత పతకాలు, 11 మంది కాంస్య పతకాలు సాధించారని వివరించారు. కటాస్ గ్రూప్‌లో అండర్-8, అండర్-12, అండర్-14 విభాగాల్లో ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. పతకాలు సాధించిన వారిని జై భారత్ విద్యా సంస్థల డైరెక్టర్ టి.జైనేంద్రారెడ్డి, హెచ్ఎం షేక్ ఖదీర్‌బాబా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

వైసిపి పాలనలో పెరుగుతున్న అఘాయిత్యాలు

మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు



ప్రచారంలో వైవి ఆంజనేయులు, టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వైసిపి పాలనలో అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 4 వార్డులో సోమవారం నిర్వహించిన 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి'లో ఆయన మాట్లాన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని, ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. పిల్లల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎంగా చంద్రబాబును మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనతో నష్టపోయిన వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కె.రామకృష్ణ, నాయకులు బి.వందనాదేవి, సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.సాంబయ్య, బి.చంద్రశేఖర్, రాజేశ్వరి, పి.పెద్దిరాజు, ఎ.అమరేశ్వరరావు, ఎ.వెంకటరామయ్య, మౌలాలి, సుభాని, ఖాసీం పీరా, నాగూర్‌వలి, రాజ్యలక్ష్మీ, పి.రమాదేవి, వై.లక్ష్మితులసి, కె.జయశ్రీ, ఎం.సులోచన, కె.అనురాధ, ఎస్.కృష్ణకుమారి, కె.రాధా రమణి, జి.వెంకటరావు, ఎన్.రమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని ముస్సాపురం, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో 'ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి'కార్యక్రమం సోమవారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు రమేష్, రామ్‌గోపాల్‌రావు, ముంతాజ్, మాజీ ఎంపిపి పి.శివమ్మ, హనుమంతరావు, సురేష్, రాంబాబు, నాగేశ్వరావు, వెంకట్రావు, అజ్మల్ల పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండలంలోని రామచంద్రపురంలో 'ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందన వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని చెప్పారు. మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రచారంలో మంత్రి అంబటి రాంబాబు

మరోసారి గెలిపించండి : మంత్రి అంబటి

ప్రజాశక్తి - ముప్పాళ్ల

అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రజలు తమను మరోసారి గెలిపించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కోరారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. సర్పంచ్ ఎం.సతీష్, నాయకులు ఎంజెఎం రామలింగారెడ్డి, ఎస్.గోపాలరావు, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపిపి ఎస్.చిన్నరాయన్న, ఎంపిడిఒ పుట్టారెడ్డి, తహశీల్దార్ భవానీశంకర్, గోళ్ళపాడు సర్పంచ్ జి.అప్పమ్మ, నాయకులు పాల్గొన్నారు.

మాండూస్‌తో పంటలకు నష్టం

- క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలి
- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తులు

ప్రజాశక్తి - పెదనందిపాడు: మాండూస్ తుఫాను ప్రభావంతో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని పొగాకు,శనగ, పత్తి పంటలకు తీవ్ర-నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేసున్తున్నారు. పొగాకు పంటకు కౌలు రూ.20వేలు పెట్టుబడి రూ.20వేలతో కలిపి మొత్తం రూ.40 వేలు ఖర్చు పెట్టామని తెలిపారు. శనగ కౌలు రూ.18వేలు , పెట్టుబడి రూ.12వేలు కలిపి మొత్తం రూ. 30వేలు వరకు పెట్టుబడి పెట్టామని, ఈ వర్షాలకు నీళ్ల నిలవడం వలన పొగాకు మొక్కలు ఉరకెత్తి చచ్చిపోతున్నాయని, నీళ్ల నిలబడిన శనగ పైరు పూర్తిగా దెబ్బతింటుందని, మళ్లీ మొదటి నుంచి సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఇకముందు వర్షాలు కొనసాగినట్లయితే పంటలు మొత్తం పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు, అలాగే పత్తితీత దశలో ఉన్నదని ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు తడిచి నాణ్యత దెబ్బతిని, దిగుబడులు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారులు, ఆర్‌బికేల అధికారులు పంట నష్టం అంచనా వేయాలని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. **తాడేపల్లి :** పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర పిసిసిఎల్‌ఎల్ అధికార ప్రతినిధి డి. సుందరరావు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. రైతుల దగ్గర వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు పని చేయడంలేదని విమర్శించారు. సమావేశంలో రైతు నాయకులు దాసరి పాండు రంగరావు, కె. సాయిచంద్ లు పాల్గొన్నారు. **తెనాలి:**పంట చేతికందే సమయంలో ఆకాల వర్షాల కారణంగా రైతాంగం నష్టపోయిందని, ప్రభుత్వం వారిని తక్షణమే ఆదుకోవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వరి ధాన్యం తడిసిపోయిందని, గాలులకు పైరు పడిపోయి, వర్షాలకు నీళ్ళలో నానిపోయిందన్నారు. తడిసిన,రంగు మారిన ధాన్యాన్ని చివరి గింజవరకూ కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు కె.కోటేశ్వరరావు, మహ్మద్ ఖుద్దూస్, టి.హరిప్రసాద్, జె.మహేష్, రైతు నాయకులు చలపతిరావు, ఈదర పూర్ణచంద్, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు. **ఫిరంగిపురం :**స్థానిక మండలంలో శని, ఆదివారాలలో కురిసిన వర్షాలకు నీట మునిగిన మిరప పొలాలను సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి కే రమణ కుమార్, హెచ్‌ఓ అశోక్ రెడ్డి పరిశీలించారు. 113 తాళ్లూరు, ఎర్రగుంట్లపాడు గ్రామాలలో మిరప పొలాల్లో నీరు నిండుగా నిలిచిపోయిందని తగు జాగ్రత్తలు పాటించాలని రైతలకు సూచించారు. వరి చేలు నిండు పొట్ట మీద ఉండడం వలన మానుగాయ వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతుల ఆందోళనలు చెబుతున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు , సిబ్బంది పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు.


పెదనందిపాడు గ్రామం పాలపర్రు మలుపు వద్ద నీళ్లు నిలిచిన శనగ పొలం


పర్చూరు రోడ్డు పక్కన వర్షాలకు ఉరకెత్తి దెబ్బతిన్న పొగాకు పంట

నేడు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ మహాసభ

ప్రజాశక్తి- మంగళగిరి

గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ మహాసభ ఈనెల 13వ తేదీన మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేన శివాజీ తెలిపారు. ఈ మహాసభలో ఏఐఆర్‌టి డబ్ల్యూ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, గుంటూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వై నేతాజీ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఆటో డ్రైవర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విధులు అంకితభావంతో నిర్వహించాలి

ప్రజాశక్తి-మంగళగిరి

షిఫ్ట్ ఆపరేటర్లు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కుప్పురావు కాలనీలో సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్కే మాట్లాడుతూ అత్యవసర సేవలో ఒకటైన విద్యుత్ ఉద్యోగులు వృత్తిపట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ సమాజానికి మేలు చేయాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి విజయ్, ఏఈ టీవీ వెంకట్రావు పాల్గొన్నారు.



పొదుపు సంఘాల మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మెల్లెంపూడి యూనిట్ ఇంచార్జ్ కే.శ్రీదేవి అన్నారు. సోమవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో పొదుపు సంఘాల మహిళలతో ఆమె ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మీనామృతం తయారీ గురించి ఆమె మహిళలకు వివరించారు.ఈ వ్యవసాయాన్ని పొదుపు సంఘాల మహిళలు క్షుణ్ణంగా తెలుసుకుని మంచి పంటలను పండించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కుంచనపల్లి గ్రామ ఐసిఆర్‌పి ఎన్ సుశీల, జి హైమావతి, కే రాజ్యలక్ష్మి, ఐబి, ఐసిఆర్ పిలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సుచరితను శాలువా కప్పి సన్మానిస్తున్న దిరిశాల సురేష్

ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు సన్మానం

ప్రజాశక్తి -పెదనందిపాడు

వరగాని గ్రామంలో ఉప సర్పంచ్ దిరిశాల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన పడిపూజ మహెూత్సవానికి మాజీ హెూం మంత్రి, పత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత హాజరయ్యారు. మహోత్సవంలో ఎమ్మెల్యే సుచరితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శబరిమల యాత్రకు వెళుతున్న అయ్యప్ప భక్తులను క్షేమంగా వెళ్లి రావాలని కోరుకున్నారు. రేపు మంగళవారం పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో అధిక వర్షాల వల్ల దెబ్బతింటున్న పంటలను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పరిశీలిస్తారని ఏబీ పాలెం సొసైటీ చైర్ పర్సన్ కూరేటి భూషయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా, వరగాని ఎంపీటీసీ దిరిశాల అనూష, దిరిశాల నాగేశ్వరరావు, కూరేటి శేషుకుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేకు ముందు సమాచార సేకరణ

ప్రజాశక్తి -దుగ్గిరాల

జగనన్న భూహక్కు,భూ రక్ష పథకంలో మండల వ్యాప్తంగా సర్వే నిర్వహించడానికి ముందుగానే సమాచార సేకరణ నిర్వహించాలని స్థానిక తహశీల్దార్ క కె. మల్లేశ్వరీ అన్నారు. సోమవారం గ్రామస్థాయి కోర్ కమిటీ సభ్యులకు సలహాలు సూచనలు ఇవ్వడానికి సమావేశం నిర్వహించారు. మంగళవారం నుండి రైతుల వివరాలు సేకరించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ప్రధానంగా మరణించిన రైతుల భూమికి సంబంధించిన వివరాలు, భూమి ఎవరికి చెందినదని వివరాలు సర్వేకు ముందే సేకరిస్తారని ఆమె తెలిపారు. మండల స్థాయి సచివాలయ సిబ్బందికి ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండల సర్వే , మండల స్థాయి గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్నతహశీల్దార్ తదితరులు

18న ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి- దుగ్గిరాల

ఈనెల 18వ తేదీన గుంటూరులో జరిగే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందే బలాల చంద్రమౌలి కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశ పోస్టరున్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దమ్ము ఆశీర్వాదం, పులివర్తి చిట్టిబాబు ,ఆర్ ఐ సతీష్ కుమార్ ,సర్వేర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌ను ఉద్యమ రూపంలో చేపట్టాలి

ప్రజాశక్తి -తెనాలి

పట్టణ పరిశుభ్రతకు ,పారిశుధ్యాన్ని పాటించటం ప్రధాన అంశంగా గుర్తించి క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఉద్యమ రూపంలో ప్రజలు చేపట్టాలని మునిసిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అన్నారు.క్లాప్ ప్రోగ్రాంలో భాగంగా ఐఈసి యాక్టివిటీస్‌ను తెనాలి పట్టణంలో ఈ నెల 12 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దానిలో భాగంగా సోమవారం 8వ వార్డులో జరిగిన అవగాహన కార్యక్రమంలో క్లాప్ యొక్క విశిష్టతను, ఉపయోగాలను ఆమె ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటి నుండి, వ్యాపార సంస్థ నుండి వచ్చే చెత్తలను తడి,పొడి,హానికర చెత్తలుగా విభజించి ఇవ్వాలని తద్వారా పట్టణ పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. హెచ్.నిర్మల ,శానిటరి ఇన్స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు,సచివాలయ సెక్రెటరీలు కె.శశికళ,జి.శ్రావణి,షేక్ ఇంతియాజ్,వై. ఏడుకొండలు,కె. హిమబిందు,శానిటరి సెక్రెటరీలు వై. సజన,బి.శ్రావణ్, వి.రోజారాణి, వాలంటీర్లు పాల్గొన్నారు.


ర్యాలీలో కరపత్రాలు పంచుతున్న చైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్


రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కొర్రపాడు విద్యార్థులు

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌కి చెందిన 9 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి అండర్- 14 ఫుట్ బాల్ జట్టుకు ఎంపికైనట్లు హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జె రమేష్ బాబు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా ఫుట్ బాల్ అండర్ -14 పోటీలు పెదకాకాని మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఈనెల 9న జరిగాయి. ఈ పోటీల్లో కొర్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో జనవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో క్రీడాకారులు పాల్గొనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్లో సోమవారం క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ పెద్దకర్మలను పలువురు అభినందించారు. విద్యా కమిటీ చైర్మన్ ఎం శ్రీనివాసరావు పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ సునీల్

డాక్టర్ సునీల్‌కు గురు స్పందన పురస్కారం

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల విశ్వ భారతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకల సునీల్‌కు గురు స్పందన పురస్కార్ -2022 పురస్కారం లభించింది. ఈనెల 11వ తేదీ విజయవాడ ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, టీచర్స్ రిలేషన్ షిప్ ఎడ్యుకేటింగ్ ఫర్ నేషన్ డెవలప్మెంట్ ట్రెండ్ పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. విద్యార్థుల మానసిక పరిపక్వత, విద్యార్థులకు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు పట్ల, ఉపాధ్యాయుల కీలక పాత్ర అనే అంశంపై ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ ప్రసంగించారు. అందుకుగాను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ బి.కృష్ణమోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ సునీల్ కు ప్రధానం చేశారు. విశ్వభారతి ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ ఓరుగంటి శకుంతల, పేరేచర్లలోని పలువురు ప్రముఖులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.


చిరంజీవిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

హార్మోనిస్ట్ కళాకారుడు చిరంజీవికి సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్:స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో ఏడాది పాటు నిర్వహించ తలపెట్టిన ఎన్టీఆర్ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ నటించిన పల్లెటూరి చిన్నోడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ హార్మోనిస్ట్ చిరంజీవిని ఉత్సవ కమిటీ సభ్యులు కొరివి శ్రీనివాసరావు, పాశం రవికుమార్, చెన్నూరి రమేష్, కావేటి వేణుగోపాల్ సత్కరించారు. కార్యక్రమంలో వేములపల్లి సుబ్బారావు, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎం.శ్రావణ్, ఎన్.శ్రీనివాస్, టి.మహేష్ పాల్గొన్నారు.

జనరల్ సీటులో పోటీ : ఎమ్మెల్సీ డొక్కా

చంద్రబాబుతోనే అమరావతి అనడం సరికాదు



ప్రజాశక్తి - తుళ్లూరు : చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే అమరావతి రాజధానిని నిర్మించుకుందామన్న ఆశ తప్ప, అభివృద్ధికి ప్రత్యామ్నాయ మార్గాలను అంగీకరించక పోవడం సరికాదని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. అమరావతి పేదల గురించి మాట్లాడితే కొంతమంది కిరాయి మనుషుల చేత తిట్టిస్తున్నారని అన్నారు. సోమవారం రాజధాని లోని వెంకటపాలెం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధానిలో రైతుల ప్లాట్లు అభివృద్ధి చేయడం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులతో పాటు ఖాళీగా ఉన్న లంక, అసైన్డ్, ఫారెస్ట్ భూములను పేదలకు ఇవ్వాలని తాను అన్నందుకు కొంతమంది అసభ్య పదజాలంతో దూషించారన్నారు. అమరావతి గురించి మాట్లాడినా, ప్రత్యామ్నాయ మార్గాలను చూపినా దూషించడం మంచిది కాదన్నారు. రైతులకు న్యాయం జరగాలన్నదే తన అభిమతమని డొక్కా స్పష్టం చేశారు. అమరావతి ఫించన్లు లబ్దిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానన్నారు. వివాదాలు లేని అసైన్డ్ భూములకు త్వరలో కౌలు చెల్లించడం జరుగుతుందన్నారు.

జనరల్ సీటులో పోటీ చేస్తా

ఎస్సీ నియోజక వర్గంలో పోటీ ఎక్కువగా ఉంటోందని, తాను జనరల్ సీటులో పోటీ చేయడానికైనా సిద్దంగా ఉన్నానని డొక్కా అన్నారు. ఎస్సీలు కేవలం ఎస్సీ నియోజక వర్గంలోనే పోటీ చేయడానికి పరిమితం కావాల్సిన పని లేదని జనరల్ సీటులో ఎందుకు పోటీ చేయకూడదని ప్రశ్నించారు. ఎస్సీ నియోజక వర్గంలో గొడవలు పడే బదులు జనరల్ సీటులో పోటిచేయడం మంచిదని భావిస్తున్నట్లు చెప్పారు. ఎంపి లేదా ఎమ్మెల్యేగా జనరల్ సీటులో నైనా పోటీకి అభ్యంతరం లేదన్నారు. డొక్కా వెంట వైసిపి నాయకులు నాయుడు నాగేశ్వరరావు, భోగినేని అప్పారావు, సుంకర శ్రీనివాసరావు, తోకల నాగేశ్వరరావు, గాదె నాగేశ్వర రావు, ఆరేపల్లి జోజి, నేలపాటి నాగేంద్ర ఉన్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోండి : ఎంపి గల్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


లోక్‌సభలో మాట్లాడుతున్న గల్లా జయదేవ్

రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ కోరారు. సోమవారం పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ మత్స్య ఆహార ఉత్పత్తి, (సీఫుడ్) ఎగుమతుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందన్నారు. రాష్టాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ నుంచి 39 శాతం వాటాతో దేశంలో అత్యధికంగా రొయ్యల ఉత్పత్తి జరుగుతుందన్నారు. కరోనా వల్ల కొన్ని దేశాలు దిగుమతికి పరిమితులు విధించడం వల్ల ఆక్వా రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయన్నారు. రొయ్యల ఉత్పత్తిలో, ఎగుమతిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని, కానీ వాటికీ లాభసాటి ధర రాక ఆక్వా రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కోట్లు ఆదాయం తెచ్చిపెట్టే ఆక్వా పరిశ్రమలో రైతుల పరిస్థితి నానాటికి దిగజారీ పోతుందన్నారు. పెరిగిన ఎరువుల ధరలు, ఇతర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయని, అంతేగాక చెరువుల లీజు ధరలతో పాటు కూలీలు ఖర్చు కూడా భారీగా పెరగడం వల్ల రైతులకు ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దరల హెచ్చుతగ్గులను రొయ్యల ఎగుమతిదారులు మరింత నిరాశకు గురిచేసిందన్నారు. కష్టాల్లో ఉన్న ఆక్వాకల్చర్ రంగాన్ని రక్షించ డానికి, ఇతర దేశాల దిగుమతిదారులతో చర్చలు జరిపేందుకు ఆక్వా ఉత్పత్తులు లాభసాటి ధరతో సజావుగా ఎగుమతి అయ్యేలా చూడడానికి ప్రధాన మంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని సమస్యలను పరిష్కరించడానికి ఎటువంటి ఆలస్యం చేయకుండా భారతీయ ఎగుమతిదారులు మరియు ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించాలని ఎంపెడాను ఆదేశించాలని కోరారు.


కిట్స్‌లో జాతీయ స్థాయి ఐడియా తాన్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న విద్యార్థులు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఎఐసిటిఇ, స్ప్రైసెస్ స్కీమ్స్ సౌజన్యంతో రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి ఐడియా తాన్ సోమవారం ముగిసింది. ఈ ఐడియా తాన్‌లో వివిధ రాష్ట్రాల నుండి 80 టీములు పాల్గొన్నాయి. విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఆయా ఆవిష్కరణలను వివిధ కంపెనీల సిఇఒలు, ఐఐటి, ఎన్ఐటిల నుండి పూర్వ విద్యార్థులు హాజరై మూల్యాంకనం చేశారు. కళాశాల ఛైర్మన్ కె.సుబ్బా రావు, సెక్రెటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ఉన్నతమైన ఆవిష్కరణలకు సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు అభివృద్ధి చేయటానికి అవసరమైన అన్ని వసతులు, ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, ఆవిష్కార్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



నేడు కెఎల్‌యులో బాలోత్సవం

మంగళగిరి - తాడేపల్లి పరిధిలో మొదటి పిల్లల పండుగ



బాలోత్సవానికి సిద్ధమైన కెఎల్‌యు ప్రాంగణం

పిల్లల్లోని సృజనాత్మకతను బయటికి తీసేందుకు, పిల్లల శక్తి, సామర్థ్యాలను పెంపొందింపజేసి, ప్రోత్సహించే దిశగా మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం వేదిక కానుంది. మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయం ఈ పిల్లల పండుగకు వేదిక కానుంది.

ప్రజాశక్తి-తాడేపల్లి, తాడేపల్లి రూరల్

మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం (మొదటి పిల్లల పండుగ) కెఎల్ యూనివర్సిటీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందని అధ్యక్ష కార్యదర్శులు వివి.ప్రసాద్ (ప్రిన్సిపాల్ నిర్మలా కళాశాల మంగళగిరి), కె.త్రిపతిరాయ్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ కెఎల్ యూనివర్శిటీ) తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ప్రారంభ సభలో ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, వైస్ చాన్సలర్ కెల్ యూనివర్శిటీ జి. పి. సారధి వర్మ, తాడేపల్లి క్యాట్ అధ్యక్షులు జిఎస్ఆర్ మోహన్ రావు, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రెసిడింట్ టి. సతీష్, రాష్ట్ర బాలోత్సవాల సమన్వయకర్త పిన్నమనేని మురళి కృష్ణ, పాల్గొంటారని చెప్పారు. సాయంత్రం జరిగే బహుమతుల ప్రాధానోత్సవ సభలో బాలోత్సవం వ్యవస్థాపకులు కొత్తగూడెం, (తెలంగాణ) వాసిరెడ్డి రమేష్ బాబు, వైస్ చాన్సలర్ కె.ఎల్ యూనివర్శిటీ ఎన్. వెంకట్‌రామ్, కాకినాడ క్రియ పిల్లల పండుగ ఎస్ఎస్ఆర్ జగన్నాధరావు, అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, ఎంటిఎంసి బాలోత్సవం ఉపాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, ఎంటిఎంసి బాలోత్సవం కార్యదర్శి పి. శ్రీలక్ష్మి, రోటరీ క్లబ్ తాడేపల్లి అధ్యక్షులు ఉన్నంగి వివేకానందరెడ్డి, పాల్గొంటరాని చెప్పారు. బాలోత్సవం జయప్రదం చేయడానికి కెఎల్ యూనివర్సిటీ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. గత నాలుగు రోజుల నుండి కార్యకర్తలు, బాలోత్సవం జయప్రదం చేయడానికి విశేష కృషి చేశారు. యూనివర్శిటీ ప్రధాన ద్వారం వద్ద మంగళగి-తాడేపల్లి బాలోత్సవం ఏర్పాటు చేసిన ముఖ ద్వారం ఆకర్షణీయంగా ఉంది. ప్రధాన ముఖ ద్వారం సమాజంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ, పల్నాటి బ్రహ్మానాయుడు, గుర్రం జాషువా, కన్నెంగంటి హనుమంతుల ఫోటోలతో తీర్చిదిద్దిన ముఖ ద్వారం పిల్లర్లు ఆలోచింప జేస్తున్నాయి. ఇవికాకుండా లోపల అకడమిక్, కల్చలర్‌కు సంబంధించి 40 రకాల పోటీలు జరుగుతున్నాయి. ఇందు కోసం ఏర్పాటు చేసిన అడిటోరియాల హాల్స్‌లో దేశానికి సేవచేసిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారి పేర్లతోనూ, ఫోటోలతోనూ, గదులను పోటీలకు సిద్ధ పరిచారు. సోమవారం మధ్యాహ్నం వరకు 2వేల మంది తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తుళ్లూరు మండలాల పాఠశాలల నుండి విద్యార్థుల పేర్లు నమోదు చేసుకున్నారు. పాతూరు క్రాస్ రోడ్డు నుండి కెఎల్ యూనివర్శిటీ వరకు, కెఎల్ యూనివర్సిటీ నుండి మెల్లంపూడి వరకు యూనివర్సిటీకి వెళ్లే రహదారిలో 55 ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బాలోత్సవం విజయవంతానికి సహకరించినవారందరికి ఇదే ఆహ్వానంగా భావించి రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈదర శ్రీనివాసరెడ్డికి ఉత్తమ ఆచార్య అవార్డు

ప్రజాశక్తి-ఏఎన్‌యు


శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న విసి తదితరులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల డీన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య ఈదర శ్రీనివాసరెడ్డికి కంప్యూటర్ సైన్స్‌లో భారత సాంకేతిక విద్యా సమాఖ్య ఉత్తమ అధ్యాపకుడి అవార్డు ప్రకటించింది. అవార్డులో భాగంగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను శ్రీనివాస్ రెడ్డికి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ విసి పి రాజశేఖర్ శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఇటీవలే భారత్ ఎడ్యుకేషనల్ అవార్డులో భాగంగా భీష్మ ఆచార్య అవార్డును శ్రీనివాసరెడ్డికి లభించడం పట్ల రిజిస్ట్రార్ బి. కరుణ అభినందించారు. శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇప్పటివరకు 30 మంది పరిశోధకులు తమ పరిశోధన గ్రంథాలను సమర్పించారు. 200లకు పైగా పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. కంప్యూటర్ సైన్స్‌కు చెందిన ఆరు పుస్తకాలను, వివిధ పత్రికలలో వెయ్యికి పైగా వ్యాసాలను, 100కు పైగా కథలను, రెండు వందలకు పైగా కవితలను రచించారు. 30 సంవత్సరాల సుదీర్ఘ అధ్యాపక వృత్తిలో అనేక అవార్డులను సొంతం చేసుకోవడమే గాక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అత్యధిక వ్యాసాలు రచించినందుకు చోటు సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని ఇంజనీరింగ్ ఆర్కిటెక్చర్ కళాశాలలకు చెందిన పలువురు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఆర్‌విఆర్ అండ్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు : ప్రాంగణ ఎంపికల్లో బి.టెక్ చివరి సంవత్సరం చదువుతున్న తమ కళాశాల విద్యార్థులు 63 మందికి ఉద్యోగావకాశాలు లభించాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కాలేజీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీంతో 2022-23 సంవత్సరానికి ఇప్పటి వరకూ ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య 884కు చేరింద న్నారు. సోమవారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అభినందించారు. డెక్కన్‌ఫైన్ కెమికల్స్, ఇన్నోవా సొల్యూషన్స్, టెక్ మహీంద్ర, కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ కంపెనీలకు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సిహెచ్. శ్రీనివాసరావు, వి.జగదీష్ తదితరులు ఉన్నారు.

రూ.10 నాణేలు తిరస్కరిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు : భారత రిజర్వు బ్యాంకు ద్వారా జారీ చేసిన 10 రూపాయల నాణేలు చెల్లుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెల్లింపు సందర్భంలో 10 రూపాయల నాణ్యాలు స్వీకరించడానికి దుకాణదారులు, వ్యాపారులు అంగీకరించడం లేదనే విషయం తన దృష్టికి పలుమార్లు వచ్చాయన్నారు. ఇందువల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసిందన్నారు. భారత రిజర్వు బ్యాంకు ద్వారా జారీ చేసిన 10 రూపాయల నాణేలను తీసుకోవడానికి అంగీకరించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు మేయర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు డిసెంబర్ 10,11 తేదీలలో ఏలూరులో జరిగిన 'ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ 2022' పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు సంపత్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించి మెడల్స్ సాధించిన ఆయా విద్యార్థులు ఈ నెల 27, 28, 29తేదీల్లో కేరళలోని తిరువనంతపురంలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ పోటీలకు ఎంపికైనందున విద్యార్థులకు అభినందనలు తెలియచేశారు. జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ క్రీడాకారులు సి.హెచ్ అవిష్ను, బి.హర్షవర్ధన్ రాజు, వి.వెంకట నాగ సాయి, కె.రమ్య, యస్.భవ్య, యస్.భావిక, యస్.ఆర్.యస్ వైష్ణవి, స్విమ్మింగ్ కోచ్ ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

